AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

8-9-2025 (Monday) MAIN EDITION

## ఐవోసీలో అప్రెంటిస్ పోస్టులు

**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** దేశవ్యాప్తంగా పలు అప్రెంటిస్ పోస్టుల భర్తీ కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ రీజియన్‌లలో వీటిని భర్తీ చేయనున్నారు. మొత్తం 537 ఖాళీలున్నాయి. ఇందులో సదరన్ రీజియన్ పైప్‌లైన్స్‌లో 47, ఈస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్‌లో 156, వెస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్‌లో 152, నార్తర్న్ రీజియన్‌లో 97, సౌత్ ఈస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్‌లో 85 ఖాళీలను భర్తీ చేయనున్నారు. పూర్తి వివరాల కోసం సంస్థ అధికారిక వెబ్‌సైట్ https://iocl.com ను సంప్రదించండి.

## విద్యార్థులకు గుడ్‌న్యూస్..
## ఈ నెల 21 నుంచి దసరా సెలవులు



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** దసరా వచ్చిందంటే విద్యార్థులు ఎగిరి గంతేస్తారు. వరుస సెలవుల్లో ఎంజాయ్ చేయాలని ప్లాన్‌లు వేసుకుంటారు. దసరా సెలవులు ఎప్పటి నుంచని ఎదురుచూస్తుంటారు. ఈ క్రమంలో ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కాలేజీలకు దసరా సెలవులను ప్రకటించింది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 3 వరకు పాఠశాలలకు సెలవులు ఇచ్చింది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 వరకు జూనియర్ కళాశాలలకు సెలవులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకువచ్చిన సంస్కరణలతో వివిధ వస్తువుల ధరలు తగ్గనున్నాయి. గతంలో ఉన్న నాలుగు శ్లాబ్‌లను తొలగించి, రెండు శ్లాబ్‌లకు పరిమితం చేయడం, చాలా వస్తువులపై పన్ను భారం తగ్గనుండడంతో ధరలు దిగిరానున్నాయి. ఇది ఈనెల 23 నుంచి అమలులోకి రానుంది. ఈ నేపథ్యంలో నిత్యావసరాలను విక్రయించే దుకాణాలపై ఎలాంటి ప్రభావం లేకపోయినా.. వాహనాల అమ్మకాలపై మాత్రం ప్రభావం కనిపిస్తోంది. పలు రకాల వాహనాల ధరలు పది శాతం వరకు తగ్గనుండడంతో చాలా మంది కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారు. దీంతో షోరూంలు బోసిపోతున్నాయి.**

**–అక్షరటుడే, హైదరాబాద్**




- జీఎస్టీ శ్లాబ్ మార్పుతో తగ్గనున్న ధరలు
- అమ్మకాలు లేక బోసిపోతున్న వాహనాల షోరూంలు

## దిగిరానున్న ధరలు..
# నిలిచిన కొనుగోళ్లు

జీఎస్టీ స్వరూపంలో ప్రభుత్వం చేసిన మార్పులు పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరటనివ్వనున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్టీ విధిస్తున్నారు. శ్లాబ్‌లలో తీసుకువచ్చిన సంస్కరణలతో ఈ భారం పది శాతం తగ్గనుంది. ద్విచక్ర వాహనాలపై జీఎస్టీ భారం రూ. 8 వేల నుంచి రూ.20 వేల వరకు తగ్గే అవకాశాలున్నాయి. బజాజ్ పల్సర్, హీరో స్ప్లెండర్ వంటి వాహనాల ధరలు 10 శాతం తగ్గనున్నాయి. అలాగే 1500 సీసీలోపు ఉన్న డీజిల్, డీజిల్ హైబ్రిడ్ కార్లు, 1200 సీసీలోపు పెట్రోల్, పెట్రోల్ హైబ్రిడ్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ కార్లు గతంలో 28 శాతం జీఎస్టీ శ్లాబ్ పరిధిలో ఉండేవి. వీటిని 18 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకురావడంతో పదిశాతం వరకు ధరల భారం తగ్గనుంది. నాలుగు మీటర్ల కంటే తక్కువ పొడవున్న చిన్న కార్ల ధరలు రూ.60 వేల నుంచి లక్ష రూపాయల వరకు తగ్గనున్నాయి. నూతన శ్లాబ్ ప్రకారం టాటా అల్ట్రోజ్, హ్యుందాయ్ ఐ10, 120, రెనో క్విడ్ వంటి కార్ల ధరలు పదిశాతం తగ్గుతాయని భావిస్తున్నారు.

### 23 తర్వాత పండుగే..

జీఎస్టీ కొత్త శ్లాబ్‌లు ఈనెల 23 నుంచి అమలులోకి రానున్నాయి. దీంతో వాహనాల షోరూమ్‌లకు దసరా, దీపావళి పండుగలు ముందే రానున్నాయి. జీఎస్టీలో మార్పులతో చాలావరకు వాహనాల ధరలు పది శాతం తగ్గనుండడంతో ప్రస్తుతం చాలామంది వాహనాల కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. 23 తర్వాతే కొనుగోలు చేయనున్నారు. దీంతో షోరూమ్‌లకు తాకిడి పెరిగే అవకాశాలున్నాయి. సాధారణంగా దసరా పండుగ సమయంలో వాహనాలు కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతుంటారు. జీఎస్టీ భారం తగ్గుతుండడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్నారు. ధరలు తగ్గుతుండడంతో అమ్మకాలు పెరుగుతాయని షోరూమ్‌ల నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. జీఎస్టీపై కేంద్రం ప్రకటనతో ప్రస్తుతం వ్యాపార కార్యకలాపాలు స్తంభించినా దసరా నాటికి గణనీయంగా పెరుగుతాయని భావిస్తున్నారు. అయితే డిమాండ్ ఎక్కువగా ఉంటే దసరా నాటికి వాహనాలు అందుబాటులో ఉండకపోవచ్చు. దీన్ని షోరూమ్‌ల నిర్వాహకులు క్యాష్ చేసుకునే అవకాశాలున్నాయి.

## ఆసియా కప్‌కు ముందు ఫామ్‌లోకి పాక్ స్పిన్నర్..



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆసియా కప్ 2025 ప్రారంభానికి ముందు పాకిస్తాన్‌కు మంచి ఊరట లభించింది. ఆ జట్టులో కీలకమైన స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్ అద్భుత ఫామ్‌లోకి వచ్చాడు. తాజాగా దుబాయ్ వేదికగా యూఏఈ, పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరిగిన ట్రై సిరీస్‌లో నవాజ్ తన ఆల్‌రౌండ్ ప్రతిభతో కట్టిపడేశాడు. ముఖ్యంగా ఫైనల్‌లో అఫ్ఘనిస్తాన్‌పై ఐదు వికెట్ల హౌల్‌తో పాకిస్తాన్‌కు ఘన విజయం అందించాడు. కీలక సమయంలో బౌలింగ్‌కు వచ్చిన నవాజ్, కేవలం 19 పరుగులకే ఐదు కీలక వికెట్లు తీయడం విశేషం. అందులో రసూలీ, అజ్మతుల్లా ఓమర్జాయి, ఇబ్రహీం జర్దాన్ వికెట్లను వరుసగా తీసుకొని హ్యాట్రిక్ నమోదు చేశాడు. తన ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును కూడా సొంతం చేసుకున్నాడు. సిరీస్‌లో పది వికెట్లు పడగొట్టిన నవాజ్, బ్యాటింగ్‌లోనూ అవసరమైన సమయంలో ఫినిషింగ్ టచ్ అందించాడు. అయితే పాక్‌కి స్పిన్ అస్త్రంగా మారిన నవాజ్, ఆసియా కప్‌లో టీమిండియాపై ప్రభావం చూపిస్తాడా లేదా అన్నది మరో రెండు వారాల్లో తేలనుంది.

## టీబీజేపీకి షాక్..
## రేవంత్‌రెడ్డికి ఊరట..

**పరువు నష్టం పిటిషన్ కొట్టివేసిన సుప్రీం కోర్టు**



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ బీజేపీకి సుప్రీంకోర్టు సోమవారం షాక్ ఇచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌ను సీజేఐ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. ఈ సందర్భంగా బీజేపీ తీరుపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ నేతలకు సున్నిత మనసు ఉండకూడదని అభిప్రాయపడింది. కోర్టులను రాజకీయ యుద్ధ క్షేత్రాలుగా మార్చవద్దని సూచించింది. రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగానే ఎదుర్కోవాలని హితవు పలికింది. సీఎం రేవంత్ రెడ్డిపై తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టులో వేసిన పరువు నష్టం పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. రాజకీయ పరమైన అంశాల్లో జోక్యం చేసుకోబోమని చీఫ్ జస్టిస్ గవాయ్ ధర్మాసనం స్పష్టం చేసింది. కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ బీజేపీ వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భారీ ఊరట లభించినట్లయ్యింది.

2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కొత్తగూడెం సభలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బీజేపీ ప్రతిష్ఠను దెబ్బతీశాయని ఆరోపిస్తూ ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు గతేడాది హైదరాబాద్ ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు రద్దవుతాయని రేవంత్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. దీనిపై కోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 125 కింద కేసు కొనసాగుతుందని తెలిపింది. దీంతో రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ ప్రసంగాలు అతిశయోక్తులతో ఉండేవేనని, వాటిని పరువు నష్టంగా పరిగణించలేమంటూ ట్రయల్ కోర్టు ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ టీబీజేపీ సుప్రీంను ఆశ్రయించింది. బీజేపీ వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సోమవారం విచారించిన చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం తోసిపుచ్చింది. రాజకీయ యుద్ధ క్షేత్రాలుగా కోర్టులను మార్చకూడదని హితవు పలికింది.

## రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కవితను ఇటీవల బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆమెను పార్టీ నుంచి బహిష్కరించిన తర్వాత తొలిసారి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కవిత సస్పెన్షన్‌పై స్పందించారు. కవితపై తమ పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. చర్యలు తీసుకున్నాక తాను మాట్లాడడానికి ఏమీ లేదని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరిట విడతల వారీగా దోపిడీకి పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు అవసరం అని సీఎం అన్నారని గుర్తు చేశారు. రూ.16 వేల కోట్లతో అయ్యే ప్రాజెక్టును రూ. లక్ష 50 వేల కోట్లతో చెయ్యడమేంటని ప్రశ్నించారు. విడతల వారీగా దోపిడీకి ప్లాన్ చేశారని విమర్శించారు. రూ.1,100 కోట్లతో కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి నీళ్లను గండిపేటకు గ్రావిటీ ద్వారా తీసుకొచ్చే మార్గం ఉందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పంప్‌హౌస్‌లు నిర్మించి అంచనా వ్యయాన్ని రూ.7,600 కోట్లకు పెంచిందని ఆరోపించారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అందరి దృష్టి క్రాస్ ఓటింగ్‌పైనే నెలకొంది. మంగళవారం నిర్వహించనున్న ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థి విజయం సాధించడం లాంఛనమే కానుంది. అయితే గత కొన్ని ఎన్నికల్లో సాధించిన విజయం తరహాలో ఆధిక్యం అంత ఎక్కువగా ఉండకపోవచ్చన్న భావన వ్యక్తమవుతోంది. ఎన్డీయే అభ్యర్థికి లభించే మెజార్టీపైనే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. క్రాస్ ఓటింగ్ జరిగితే ఇబ్బందులు తప్పవని ఆందోళనలో ఉన్న బీజేపీ.. ప్రతి ఎంపీపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఓటు వేసే అంశంపై అవగాహన కల్పిస్తోంది.

### రహస్య పద్ధతిలో ఓటింగ్..

పార్లమెంటు సభ్యులందరూ కలిసి రహస్య బ్యాలెట్ ద్వారా ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. అంటే ఎంపీలు తమకు నచ్చిన విధంగా ఓటు వేయవచ్చు, అయితే, ఎంపీలు తమ పార్టీ ఆదేశాల మేరకే ఓటు వేస్తారు. ఈ క్రమంలో కొన్నిసార్లు క్రాస్ ఓటింగ్ జరగడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో బీజేపీ అప్రమత్తమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయంగా ప్రత్యర్థులకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదన్న భావనతో ఉప రాష్ట్రపతి ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. 2022లో జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ సులువుగా విజయం సాధించింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బీజేపీకి మద్దతు ఇచ్చాయి. అలాగే, మిగతా పార్టీలు కూడా ఓటు వేయడంతో జగదీప్ ధన్‌ఖడ్ మూడు దశాబ్దాలలో అతిపెద్ద విజయాన్ని సాధించారు. కాగా.. ఈ సారి ఎన్నికకు బీఆర్ఎస్ దూరమైంది.

## భారత్‌పై సుంకాలు సబబే..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో అమెరికా భారత్‌పై సుంకాలు విధించడం సరైన నిర్ణయమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. రష్యాతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్న భారతదేశంతో సహా ఇతర వాణిజ్య భాగస్వాములపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను సమర్థించారు. ఇది సరైన నిర్ణయమని అభివర్ణించారు. అమెరికన్ ప్రసార సంస్థ ఏబీసీతో మాట్లాడిన జెలెన్ స్కీ మాస్కో ఇంధన వాణిజ్యాన్ని ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆయుధంగా మార్చుకున్నారని అభివర్ణించారు. రష్యా ఎగుమతులను ఎవరూ కొనుగోలు చేయొద్దని కోరారు.

### ఈయూ దేశాలపై ఆగ్రహం

రష్యాతో ఒప్పందాలు కొనసాగించే దేశాలపై సుంకాలు విధించాలనే ఆలోచన సరైనదేనని తాను భావిస్తున్నానని జెలెన్ స్కీ తెలిపారు. చైనాలో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య ఇటీవల జరిగిన సమావేశం గురించి అడిగినప్పుడు జెలెన్‌స్కీ ఈ విధంగా స్పందించారు. మాస్కోతో ఇంధన వాణిజ్యాన్ని కొనసాగిస్తున్న యూరోపియన్ యూనియన్ దేశాలపైనా జెలెన్ స్కీ విమర్శలు చేశారు. రష్యా నుంచి ఏ రకమైన ఉత్పత్తులను కొనుగోలు చేయొద్దని కోరారు. "పుతిన్‌పై అదనపు ఒత్తిడి అవసరమని అందరం అర్థం చేసుకున్నాము. ఈ విషయంలో అమెరికాతో పాటు యూరోపియన్ యూనియన్ కూడా మరింత ఒత్తిడి తేవాలి. కానీ కొన్ని దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేస్తూనే ఉన్నాయి. ఇది న్యాయం కాదు.. రష్యా నుండి కొనుగోలు చేయడం మానేయాలి. రష్యాతో ఒప్పందాలు కుదుర్చుకునే దేశాలపై సుంకాలు విధించాలనే నిర్ణయం సహేతుకమని నేను భావిస్తున్నానని" తెలిపారు.

## హమాస్‌కు ట్రంప్ అల్టిమేటం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి హెచ్చరిక జారీ చేశారు. గాజాలో ఉంచిన బందీలను విడుదల చేయడానికి ఒప్పందానికి రావాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటికే తన నిబంధనలను అంగీకరించిందని, హమాస్ కూడా ఒప్పందానికి ముందుకు రావాలని సూచించారు. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేశారు. "ఇజ్రాయెల్ నేతలు నా నిబంధనలకు అంగీకరించారు. హమాస్ కూడా అంగీకరించాల్సిన సమయం ఆసన్నమైంది" అని ట్రంప్ రాసుకొచ్చారు. "ఒప్పందానికి రాకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇది నా చివరి హెచ్చరిక, మరొకటి ఉండదు" అని ఆయన స్పష్టం చేశారు.

2023 అక్టోబర్ ప్రారంభంలో హమాస్ ఇజ్రాయిల్‌పై అనూహ్య దాడి చేసి వందలాది మందిని హతమార్చింది. అలాగే, 400 మంది దాకా బందీలుగా తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్ గాజాపై దాడులకు దిగింది. దాదాపు రెండెళ్లుగా కొనసాగుతున్న ఈ సంక్షోభాన్ని ముగించేందుకు అమెరికా సహా పలు దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. గతంలో జరిగిన చర్చల ఫలితంగా కొంత మంది బందీలను హమాస్ విడుదల చేసింది. అయితే, ఇరుపక్షాలు కాల్పుల విరమణను ఉల్లంఘించడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇజ్రాయిల్ మరోసారి సైనిక చర్య చేపట్టింది. ఆ దేశంతో పాటు పాలస్తీనా మిలిటెంట్ గ్రూపుల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ట్రంప్ తాజాగా మరో హెచ్చరిక జారీ చేశారు. శాంతి ఒప్పందానికి ముందుకు రావాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.